

పైలేరియా నియంత్రణపై శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జూలై 15 : జాతీయ పైలేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష హాజరై జిల్లాలోని ఎనిమిది పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఉప కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మాట్లాడుతూ రెండేళ్లు నిండిన అందరికీ వచ్చే నెల 10వ తేదీన పైలేరియా నివారణ మాత్రలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



ఈసారైనా సీఎంఆర్
లక్ష్యం చేరేనా?

- ఇవ్వాల్సిన బియ్యం 1,80,360 మెట్రిక్ టన్నులు
- ఇచ్చింది 1,05,114 మెట్రిక్ టన్నులు
- 15 మంది మిల్లర్లే 90 శాతం అప్పగింత
- మిగతావారు 30 శాతం లోపే!

మెదక్, జూలై 14: రైతులు పండించిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యాన్ని ప్రభుత్వానికి నిర్ణీత మొత్తం కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సిన మిల్లర్లు మీనమేషాలు లెక్కబెడుతున్నారు. పౌర సరఫరాలశాఖకు నుంచి తీసుకున్న ధాన్యానికి నిర్ణయించిన 'సీఎంఆర్' ఈసారి కూడా ఇచ్చేలా కనిపించడం లేదు. గతేడాది 2023 - 24 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ డీఆర్‌డీఏ, ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన 2,68,377 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 104 పారాబాయిల్డ్, రా రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించారు. మిల్లర్లు 1,80,360 మెట్రిక్ టన్నుల బియ్యం పౌర సరఫరాల శాఖ, ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు 1,05,114 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. మిగిలిన 75,246 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు 58.3 శాతం బియ్యం ప్రభుత్వానికి సీఎంఆర్ కింద చెల్లించారు.ఇందులో 15 మిల్లులు మాత్రమే 90 శాతం బియ్యం ప్రభుత్వానికి అప్పగించాయి. మిగిలిన మిల్లులు ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే ఇచ్చాయి. ఇద్దరు, ముగ్గురు మిల్లర్లు 10 శాతం లోపే బియ్యం అప్పగించడంతో అధికారులు కన్నెర్ర జేస్తున్నారు. ఆయా మిల్లర్లు పౌర సరఫరాల శాఖ అధికారులకు అందుబాటులోకి రాకుండా తప్పించుకు తిరుగుతున్నారు.

గడువు దాటితే గల్లంతయ్యే ప్రమాదం

గతంలోనూ రైస్ మిల్లర్లు కొందరు ప్రభుత్వం తమకు కేటాయించిన ధాన్యాన్ని మార్కెట్లో అమ్ముకుని ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కేసులపాలై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ఇవ్వని మిల్లర్ల నుంచి రూ.83,85,92,118 కోట్ల విలువైన ధాన్యం రికవరీ చేయాల్సి ఉంది. ఈ మొత్తం తిరిగి రాబట్టుకునేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు 17 మంది మిల్లర్లపై ఆర్‌ఆర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. 56 మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టారు. కఠిన చర్యల ఫలితంగా ఎనిమిది మంది మిల్లర్ల నుంచి రూ. 14,75,95,300 వసూలు చేయగలిగారు.

సెప్టెంబరు 30 వరకు గడువు

2023- 24 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ బియ్యం అప్పగించడానికి సెప్టెంబరు 30 వరకు గడువు ఉంది. గడువు దాటితే మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గతంలోనూ సీఎంఆర్ ఇవ్వకుండా పక్కదోవ పట్టించిన మిల్లర్లపై ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించాం. పలువురు మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాం. ఆ పరిస్థితులు పునరావృతం కాకుండా వెంటనే సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సిందిగా మిల్లర్లకు సూచిస్తున్నాం.

-హరికృష్ణ, సివిల్ సప్లయ్స్ డీఎం, మెదక్





కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, స్థానిక నాయకులు

చెదిరిన గులాబీ

- కాంగ్రెస్ గూటికి 'గూడెం'
- అదే దారిలో అనిల్‌కుమార్
- బీఆర్‌ఎస్‌లో ఆందోళన
- చేరికలపై సీనియర్ల అలక
- రసవత్తరంగా పటాన్‌చెరు రాజకీయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 15: ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్' జోరందుకుంది. ఊగిసలాటలో ఉన్న నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీగా పోటీసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో పటాన్‌చెరు రాజకీయం రసవత్తరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు గెలవగా.. అందులో ఒకరు పార్టీ మారారు. జాబితాలో ఇంకెవరున్నారనే ఆసక్తి నెలకొంది.

ఎట్టకేలకు కాంగ్రెస్‌లోకి..

వరుసగా మూడుసార్లు పటాన్‌చెరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మహిపాల్‌రెడ్డికి స్థానికంగా గట్టి పట్టుంది. గడిచిన మూడు దఫాలుగా ఈ నియోజకవర్గంపై ఎంతోమంది బీఆర్‌ఎస్ నేతలు కన్నేసినప్పటికీ మహిపాల్‌రెడ్డి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అయితే ఇటీవల తన కుటుంబసభ్యుల వ్యాపారాలపై ఈడీ దాడులు జరిగాయి. దీంతో అభద్రతకు లోనైనట్లుగా తెలుస్తున్నది. అందుకే బీజేపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగింది. ఆయన ఢిల్లీలో పర్యటించడం పలు అనుమానాలకు తావిచ్చింది. అయితే, ఆయన కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం మూడురోజులుగా ఊపందుకుంది. అనుకున్నట్లుగానే సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ నుంచే ప్రస్థానం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీలోనే ప్రారంభం అయింది. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పటాన్‌చెరు మండలాధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో పటాన్‌చెరు నుంచి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తరువాత కొంతకాలం టీడీపీలో చేరి తరువాత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వ్యవహరించారు. తెలంగాణ ఏర్పాటు తరువాత 2014లో అనూహ్యంగా టీఆర్‌ఎస్ పటాన్‌చెరు టికెట్ దక్కించుకుని గెలుపొందారు. అలా మూడుసార్లు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించారు. బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. బీఆర్‌ఎస్‌లో హరీశ్‌రావుకు దగ్గరి వ్యక్తిగా వ్యవహరించారు.

ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరి..

మరోవైపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశించి భంగపడిన గాలి అనిల్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపించనప్పటి నుంచి గాలి అనిల్‌కుమార్ టీఆర్‌ఎస్‌లో పనిచేశారు. 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. పదేళ్లపాటు ఆయన కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశారు. 2019లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించినా.. అక్కడా నిరాశే ఎదురవడంతో గత అసెంబ్లీ ఎన్నికల ముందు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. జహీరాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగి ఓడిపోయారు.

ప్రత్యర్థులంతా ఒకే గూటిలో..

పటాన్‌చెరులోని రాజకీయ ప్రత్యర్థులంతా ప్రస్తుతం కాంగ్రెస్ గూటికే చేరడం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు టికెట్ కోసం గూడెం మహిపాల్‌రెడ్డితో పోటీపడిన నీలం మధు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి బీఎస్పీ నుంచి పోటీచేశారు. తదనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి మెదక్ ఎంపీ టికెట్ దక్కించుకుని స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్.. పలుచోట్ల మాట్లాడుతూ నీలం మధు కారణంగానే తాను ఓడిపోయానని ఆవేదన చెందారు. ప్రస్తుతం తనతో పోటీపడిన ఇద్దరూ కాంగ్రెస్‌లోనే చేరడంతో ఆయన భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్నారు. జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ శ్రీనివాస్‌గౌడ్‌ను బుజ్జగించారు. పటాన్‌చెరులో పలు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీపడిన నేతలంతా ప్రస్తుతం కాంగ్రెస్ గూటికే చేరడం గమనార్హం. ఆయా పార్టీల్లో ఉప్పునిప్పులా ఉన్న నేతలంతా ఒకే పార్టీలో ఎలా మసులుకుంటారో వేచిచూడాలి.

నెక్స్ట్ ఎవరో..!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం అప్పట్లో సంచలనంగా మారింది. వీరు కాంగ్రెస్‌లో చేరతారనే ఊహాగానాలు వినిపించాయి. గడిచిన ఎంపీ ఎన్నికల్లోనూ ఒకరిద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అంటీముట్టనట్లుగానే ఉన్నారనే విషయం ఫలితాల్లో తేటతెల్లమైంది. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మూడోస్థానం రావడంతో మిగిలిన ఎమ్మెల్యేలు కూడా పక్కచూపులు చూడడం ప్రారంభించారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లోని ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నా.. సీఎం కేసీఆర్, హరీశ్‌రావు సొంత జిల్లాలో ఆ పరిస్థితి రాదని భావించారు. అయితే, గూడెం మహిపాల్‌రెడ్డి చేరికతో అది బ్రేక్ అయ్యింది. తరువాత వంతు ఎవరిదోనని ఆసక్తిగా చూస్తున్నారు.

కొత్త క్రషర్లకు అనుమతులు
ఎలా ఇస్తారు?

ప్రజలు వ్యతిరేకించినా వినరా?

7లో

మాదారం, రాళ్లకత్వ పరిధిలో కంకర మెషీన్లు, క్వారీలు వద్దని ఆందోళనలు





ఆర్‌ఆర్‌ఆర్ సర్వేను అడ్డుకుంటున్న రైతులు (ఫైల్)

పరిహారంపై పేచీ

సంగారెడ్డి రీచ్ కెనాల్‌కు భూములిచ్చేందుకు రైతుల విముఖత

7లో

వదులుకునే ప్రసక్తే లేదని పోరుబాట

స్పష్టత ఇవ్వాలని రిలే దీక్షలు

అబ్బురపరిచే ఆవిష్కరణలు

ఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ డే.. ప్రారంభించిన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

అవకాశాల అన్వేషణకు చక్కని మార్గం ● ఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



కందిలోని ఐఐటీహబ్ వినూత్న ఆవిష్కరణలకు వేదికగా మారింది. ఇన్నోవేషన్ డేలో భాగంగా వివిధ విభాగాల వారు రూపొందించిన ఆవిష్కరణలు వారి ప్రత్యేకతను చాటాయి.

7లో



మెదక్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



సంగారెడ్డిలో ఫిర్యాదును పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

మెదక్‌లో 144, సంగారెడ్డిలో 75 అర్జీలు

సంగారెడ్డి రూరల్, జూలై 15 : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి అర్జీలను స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకుని.. పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు కర్రె పద్మయ్య తనకు 30 గుంటల భూమి ఉండగా.. ఇందులో ఒక గుంటకు సంబంధించి రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మూడు సంవత్సరాలుగా తిరుగుతున్నా పరిష్కరించడం లేదని ఫిర్యాదు చేశారు. హత్నూర మండలం, మంగాపూర్ గ్రామానికి చెందిన గడ్డమీది వీరయ్య తన 30 గుంటల భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, తమ సంతకాలను ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించినట్టు దస్త్రాలు తయారు చేశారని ఫిర్యాదు చేశారు. చౌటకూర్ మండలం వెండికోల్ గ్రామానికి చెందిన వీరప్ప తన తల్లి మృతి అనంతరం ఆమె పేరిట ఉన్న 3 గుంటల భూమిని నాలుగు నెలలుగా తన పేరిట ఫౌతీ చేయకుండా నిలిపేశారని ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన దివ్యాంగురాలు వంశీప్రియ ఎంబీఏ చేసినా ఉద్యోగం లేదని, బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నారు. పది సంవత్సరాలుగా అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. వీటితో పాటు పింఛన్లు, ఇళ్ల, బ్యాటరీ ట్రైసైకిళ్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

- పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీ హుడా లేఅవుట్ పార్కుస్థలం కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని ప్రజావాణిలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతికి కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నాముదిరాజ్ ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులకు రెండుసార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.
- పుల్‌కల్: చౌటకూర్ మండలంలోని తాడ్దానిపల్లి గ్రామ శివారులో భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఎర్రోల్ల రమేశ్, ఎర్రోల్ల సుశీల జిల్లా కలెక్టర్‌కు సోమవారం పిర్యాదు చేశారు. గ్రామ శివారులో సర్వే నంబరు 211/39, 40లో తమకు 2 ఎకరాల చొప్పున 4 ఎకరాల భూమిని ప్రభుత్వం నలభై ఏళ్ల క్రితం కేటాయించిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. 2010లో హైదరాబాద్‌కు చెందిన మాజీ సైనికోద్యోగి అబ్దుల్ నసీర్‌కు సర్వే నంబర్ 211/4, 5లో ప్రభుత్వ భూమి 5 ఎకరాలని కేటాయిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పట్టదారు పాసు పుస్తకాలను జారీ చేశారన్నారు. నసీర్‌కు పోజిషన్ చూపించకపోవడంతో.. తమ భూమినే నసీర్‌కు చెందినదిగా పేర్కొంటూ గ్రామానికి చెందిన బేగరి చంద్రయ్య, ఎర్రోల్ల పెంటయ్య, ఫసల్‌వాది గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ కబ్జాకు పాల్పడేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సత్వరమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, జూలై 15: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 144 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లానలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాలన్నారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల్లో ధరణికి సంబంధించి 43, డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 18, ఇతర దరఖాస్తులు 71 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

భూమిని అమ్మినవారిపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, జూలై 15 : సంగారెడ్డి జిల్లా కంది మండలం బ్యాతోల్ గ్రామానికి చెందిని మామిళ్ల మాణెమ్మ తనకు సంబంధించిన వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సోమవారం జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌కు ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో సర్వే నంబర్ 97-అ లో తనకు 1.04 ఎకరాల భూమి ఉందని, ఇందులో 11 గుంటల భూమిని రెండేళ్ల క్రితం గొల్ల లలిత తనకు తెలియకుండా కడెంగారి చంద్రశేఖరెడ్డి, శ్రావణిలకు విక్రయించారన్నారు. దీనిపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే కొనుగోలుదారులు ధరణిలో తమ పేరిట రికార్డులు మార్చుకున్నారని పేర్కొన్నారు. తన భూమిని అక్రమంగా అమ్మిన వారిపై, కొన్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఎస్పీని కోరారు.

'ట్రిపుల్‌ఆర్' బాధితులకు న్యాయం చేయండి

నర్సాపూర్, జూలై 15: 'ట్రిపుల్‌ఆర్' నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు రైతులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో తమ అనుయాయుల కోసం ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను పలుమార్లు మార్చారని పిర్యాదు చేశారు. దీంతో రెడ్డిపల్లి గ్రామంలో చెరువు, ఇళ్లు, సన్నకారు రైతుల భూములు పోతున్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించి తొలుత చేసిన సర్వే ప్రకారమే రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. భూములు కోల్పోయే రైతులందరికీ మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందజేయాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఒకసారి అలైన్‌మెంట్ నిర్ణయించిన తరువాత మార్చడం వీలుకాదని.. కానీ, భూములు కోల్పోయే రైతులకు ఇస్తున్న పరిహారం పెంచేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం, ఓబీసీ సెల్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

ఆగస్టు 14న బహిరంగ వేలం


కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెరకర్మాగారం

జహీరాబాద్, జూలై 15: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం అమ్మకానికి సిద్ధమైంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆర్ ఆర్ యాక్ట్‌లో భాగంగా ఆగస్ట్ 14న ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ రవీందర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో స్థానిక చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి నాలుగు, ఐదు ఏళ్లుగా ఈ కార్మాగారం నిర్వహణ అంతంత మాత్రంగానే సాగుతోంది. 2022-23లో చెరకు క్రషింగ్ జరిగినా, రైతులకు డబ్బు ఇవ్వకపోవడంతో అధికారులు, నాయకులు జోక్యం చేసుకుని రూ.80 కోట్ల మేర బిల్లులు ఇప్పించారు. 2023-24లో క్రషింగ్ జరగలేదు. 1970లో చెరకు రైతుల సౌకర్యార్థం రోజుకు 1500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో నిజాం చక్కెర కర్మాగారాన్ని దివంగత నేత స్వర్గీయ బాగారెడ్డి కృషితో ఏర్పాటైంది. తొలి రోజుల్లో రైతు 5 వేల ఎకరాల్లో చెరవు సాగు చేశారు. ప్రస్తుతం సాగు 25 వేల ఎకరాలకు విస్తరించింది. ప్రభుత్వ భాగస్వామ్యంతో నిజాం షుగర్స్ పేరిట నడిచిన ఈ కార్మగారాన్ని చంద్రబాబు హయాంలో ప్రైవేట్ వారికి విక్రయించారు. వారు 2022-23 వరకు క్రషింగ్ చేశారు. తర్వాత కర్మాగారం మూత పడింది. అయితే, కర్మాగార యాజమాన్యం మొత్తం రూ. 30 కోట్లు అప్పు పడినట్లు తెలుస్తున్నది. అందులో ఐదున్నర కోట్లు కార్మికుల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.7 లక్షలు రైతులకు చెరకు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. అలాగే, కర్మాగారాన్ని మార్టిగేజ్ చేసి రూ. 24 కోట్లు అప్పు తీసుకున్నారు. ఈ అప్పులు తీర్చకపోవడంతో ఆర్ఆర్ యాక్ట్ కింద కర్మాగారాన్ని వేలం వేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలని తహసీల్దార్ కోరారు.


తహసీల్దార్ జారీ చేసిన చేసిన వేలం ప్రకటన

రూ.34.94 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల పట్టివేత

డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యం : ఎస్పీ చెన్నూరి రూపేష్

మునిపల్లి, జూలై 15 : కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రూ.34.94 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు సోమవారం సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. మునిపల్లి మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌లోని కాటేదాన్‌కు టీఎస్ 01యూఏ 5009 డీసీఎంలో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నారని పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ ప్లాజా వద్ద ఏఎస్ఐ ఏసయ్య తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. 60 బ్యాగుల్లో రూ.34,94,400 విలువ చేసే 58,240 పోచెస్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన షేక్ షబ్బీర్ అహ్మద్, తన్‌సిఫ్‌లను అరెస్టు చేశామని, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన అర్బత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టి డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ రూపేష్ తెలిపారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేసి విస్తృ దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుట్కా, గంజాయి విక్రయాలపై నిషేదం ఉందని, అమ్మినా.. కొన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుట్కా, గంజాయి విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో 8712656777కు సమాచారం అందిస్తే వారికి పారితోషికం అందించి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, సీసీఎస్ సీఐ మల్లేశం, ఎస్ఐలు రాజేష్ నాయక్, శ్రీకాంత్, ఏఎస్ఐ ఏసయ్య తదితరులు పాన్నారు.


కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్పీ రూపేష్

సత్ప్రవర్తనతో మెలగాలి

సంగారెడ్డి క్రైం, జూలై 15 : నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పాత నేరస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలిగితే హిస్టరీ షీట్ నుంచి తొలగిస్తామని తెలిపారు. జిల్లాలో గంజాయి పండించినా, అక్రమ రవాణా చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలవాటు పడిన నేరస్థులపై పీడీ యాక్టు నమోదు చేసి హిస్టరీ షీట్స్ తెరుస్తామన్నారు. నూతనంగా వచ్చిన చట్టం ప్రకారం కఠిన చర్యలున్నాయని, ఇద్దరు, ముగ్గురు కలిసి నేరం చేసినట్లయితే ఆర్గనైజ్ క్రైంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులతో ఫ్రెండ్లీగా ఉండాలని, జిల్లాలో జరుగుతున్న అక్రమాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

పప్పన్నమే.. కూర లేదు..!

నిత్యం ఒకే రకం ఆహారంతో విద్యార్థుల ఇబ్బందులు

కౌడిపల్లి, జూలై 15 మండల పరిధిలోని సలావత్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10 వతరగతి వరకు 123 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలకు మధ్యాహ్నం భోజనం అక్షయపాత్ర నుంచి వస్తుంది. ప్రతీ రోజు ఒకే రకం పప్పు తీసుకురావడంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడడం లేదు. పప్పు నాణ్యత లేకుండా వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా పప్పన్నం తినలేకపోతున్నామని పేర్కొన్నారు. వారంలో ఒకరోజైన కూరగాయ తీసుకురావాలని కోరుతున్నారు.


పాఠశాలలో పెట్టిన పప్పు, అన్నం

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్, జూలై 15: లారీలో తరలిస్తున్న 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జగదేవ్‌పూర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపిన వివరా ప్రకారం.. జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బుద్ద రాములు, గుర్రం రాములు ఇద్దరు కలిసి అనుమతి లేకుండా రేషన్‌బియ్యంను హైదరాబాద్‌కు రవాణా చేస్తుండగా నమ్మద గ్గ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పట్టుబడిన లారీ

వన మహోత్సవంలో
భాగస్వామ్యం కావాలి

- జిల్లా వ్యాప్తంగా 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఇంటింటికీ మొక్కల పంపిణీ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 15 : ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా ప్రజలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో 15 లక్షల మొక్కలు నాటారని, మిగిలిన మొక్కల నాటే కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల, ఇరిగేషన్, అటవీ భూముల్లో అనువైన స్థలాను గుర్తించి మొక్కలను నాటుతామన్నారు. నాటడమే కాకుండా, పరిక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి రవికుమార్, డీఆర్డీఏ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆర్టీసీ, విద్య, డీఆర్డీవో, ఆరోగ్య, పంచాయతీ, వ్యవసాయ, పౌరసరఫరా, అటవీ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల పనితీరును శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణం, ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యాలు, డిపోలలో పరిశుభ్ర కార్యక్రమాలు, మహిళల స్వయం సహాయక గ్రూపులకు అందించే సహాయ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వ్యవసాయ స్థితిగతులు, వర్షభావ పరిస్థితులు, రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు విద్యుత్, రేషన్ బియ్యం, గ్యాస్ సరఫరా, జిల్లాలో నాటే మొక్కల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, రాధాకిషన్ గోవిందు, బ్రహ్మారావు, రవికుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో
సూక్ష్మరాతి పనిముట్లు లభ్యం

క్రీస్తుపూర్వం 8వేల సంవత్సరాల కాలం నాటివిగా గుర్తింపు



నంగునూరు జోకిరమ్మ బండపై లభ్యమైన సూక్ష్మరాతి పనిముటు

నంగునూరు, జూలై 15 : సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి దక్షిణం వైపున ఉన్న జోకిరమ్మ బండ మీద సూక్ష్మరాతి పరికరాలు (మైక్రోలిథిక్ టూల్స్) లభ్యమైనట్లు ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలంగా గ్రామంలో పరిశోధనలు చేస్తున్న ఆయన కొత్త రాతి యుగం నాటి రాతి గొడ్డళ్లు, శాతవాహనుల కాలం నాటి టెర్రకోట బొమ్మలు, పూసలు, దేవత విగ్రహాలను గుర్తించారు. ఈసారి సూక్ష్మ రాతి పనిముట్లను గుర్తించినట్లు తెలిపారు. ఇవి చిన్న రాతి పనిముట్లు అని, ఇందులో కొన్ని ఒక సెంటీమీటర్ పొడవు ఉండగా మరికొన్ని అంతకంటే చిన్నవిగా ఉన్నాయన్నారు. వీటిలో బ్లేడు, బాణం మూలికి లాంటి పరికరాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. క్వార్ట్, చెర్ట్ చాల్సేడ్, జాస్పర్, చెకుముకి వంటి రాళ్లతో ఇవి తయారు చేశారని, వీటి వయస్సు క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాల కాలానికి చెందినవని, వీటిని బట్టి కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఈ బండ మానవ ఆవాసంగా ఉండేదని శ్రీనివాస్ పేర్కొన్నారు.

రేబర్తిలో ఆయిల్‌పామ్ కోతలు ప్రారంభం



గెలలను చూపెడుతున్న ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్

మద్దూరు, జూలై 15 : మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో రైతు నలుసాని లింగారెడ్డి సాగు చేసిన ఆయిల్ పామ్ తోట కోతకు రావడంతో సోమవారం ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్ గెలల కోతల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లింగారెడ్డి తన వ్యవసాయ భూమిలో 12 ఎకరాల్లో పామాయిల్‌ను సాగు చేసినట్లు తెలిపారు. 6 ఎకరాల్లో గెలలు కోతకు రావడంతో కోతలు ప్రారంభించగా సోమవారం ఒక ఎకరంలో గెలలను కోసినట్లు తెలిపారు. మరో నాలుగు రోజులు కోతలుంటాయని తెలిపారు. కోసిన గెలలకు ప్రతీ మండలానికి కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి ఫ్యాక్టరీకి తరలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డు అసిస్టెంట్ రాకేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

పిరమల్ ఫార్మా పరిశ్రమలో
సీఐటీయూ ఘన విజయం



విజయోత్సవంలో సీఐటీయూ నాయకులు

కోహీర్, జూలై 15 : మండల పరిధి దిగ్వాల్‌లోని పిరమల్ ఫార్మా పరిశ్రమలో సోమవారం నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ కార్మిక సంఘం విజయం సాధించింది. పరిశ్రమలో 137 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ కార్మిక సంఘం తరఫున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘం తరఫున హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్, ఎన్ఐటీయూసీ అనుబంధ సంఘం తరఫున హుగ్గెల్లి రాములు బరిలో నిలుచున్నారు. సీఐటీయూ కార్మిక సంఘానికి 68 ఓట్లు రాగా, హెచ్‌ఎంఎస్‌కు 53 ఓట్లు వచ్చాయి. ఎన్ఐటీయూసీ కేవలం 15 ఓట్లతో సరిపెట్టుకున్నది. 15 ఓట్ల మెజార్టీతో సీఐటీయూ కార్మిక సంఘం విజయం సాధించడంతో నాయకులు పరిశ్రమ వద్ద విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ తనకు విజయాన్ని అందించిన పరిశ్రమ కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్మికులకు మంచి వేతన ఒప్పందంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా పనిచేస్తానని పేర్కొన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతీ కార్మికుడికి చుక్కా రాములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు



ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ డే.. ప్రారంభించిన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

- నూతన స్టార్టప్‌ల సందడి
- ప్రతిభావంతుల అవకాశాల అన్వేషణకు చక్కని మార్గం
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూలై 15 : ఆధునిక సాంకేతికతతో పరిశోధనలు చేపట్టి నూతన ఆవిష్కరణలను ముందుకు తీసుకొచ్చే కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ వేదికైంది. సోమవారం ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ 'ఇన్వెంటివ్-2024' వేడుకలో దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన ఉన్నత విద్యాసంస్థలు పాల్గొన్నాయి. ఇందులో భాగంగా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఈ-మొబిలిటీ, క్లీన్ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణ, పరిశ్రమలు వంటి కీలక అంశాలపై ఆవిష్కరణల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతిభావంతులకు విలువైన అవకాశాలను అన్వేషించడానికి చక్కటి మార్గమని తెలిపారు. ప్రపంచ సవాళ్లను అధిగమించే సాంకేతిక పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఈవెంట్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇన్నోవేషన్ డే ఫెయిర్ నేడు కూడా కొనసాగుతుందన్నారు.



వీధి వ్యాపారులకు త్రీ వీలర్ ఎలక్ట్రికల్ వెహికిల్

వీధి వ్యాపారులకు అనువుగా ఉండే త్రీ వీలర్ ఎలక్ట్రికల్ వెహికిల్‌ను వరంగల్ కాకతీయ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేశారు. ఈ వాహనం ఉంటే షాప్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. 500 కేజీల వరకు సరుకులను ఇది మోస్తుంది. 6 గంటలు చార్జింగ్ పెడితే 100 కిలోమీటర్లు ప్రయాణించే ఈ త్రీవీల్ ధర రూ.1.20 వేలు. వచ్చే నెల నుంచి ఇది మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది.

రోబోటిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్

ప్లైబేసీ స్టార్టప్ కంపెనీ ఐఐటీహెచ్ భాగస్వామ్యంతో రోబోటిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్‌ను రూపొందించింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేషెంట్లను పట్టణాల్లో ఉన్న డాక్టర్ ఇంటర్నెట్ సహాయంతో స్కాన్ చేయొచ్చు. ఇది ఎక్కువగా ప్రెగ్నెంట్ మహిళల్లో గాల్ బ్లాడర్ స్టోన్స్, కిడ్నీ స్టోన్స్ క్యాన్సర్‌ను గుర్తిస్తుంది. ఈ మెషీన్ ఖరీదు రూ.20 లక్షలు. ప్రత్యేకించి అల్ట్రాసౌండ్ పరీక్ష కోసం రేడియాలజిస్టు ఉండాల్సిన అవసరం ఉండదని పరిశోధకులు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ టెక్నాలజీ సాయంతో సాంకేతికపరంగా మరిన్ని అద్భుతాలు చేసి చూపెడతామని పరిశోధకులు చెబుతున్నారు.

యంత్రంతో వరినాట్లు

వరినాట్లు వేసేందుకు కూలీలు దొరకని నేపథ్యంలో మనుషులకు బదులు యంత్రంతో వరినాట్లు వేసేందుకు జపాన్‌కు చెందిన సుజికి ఇన్నోవేషన్ సెంటర్ ఐఐటీహెచ్ భాగస్వామ్యంతో ఓ యంత్రాన్ని తయారుచేసింది. దీని ధర రూ.25 వేలుగా నిర్ణయించారు. దీంతో చిన్నకారు రైతులు స్వయంగా నాట్లు వేసుకోవచ్చు. దీని సహాయంతో ఇద్దరు మనుషులు ఎకరం నాటు నాలుగు గంటలలో వేయొచ్చు.



వ్యర్థాల నుంచి కంకర తయారీ

ఉత్తరప్రదేశ్, బీహార్, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో గత కొంత కాలంగా కంకర కొరత ఏర్పడింది. ఈ ప్రాంతాల వారు కంకర కొనాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. ఈ నేపథ్యంలో బొగ్గు గనులు, థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి సేకరించిన ఇసుక, బూడిదను ఉపయోగించి ఐఐటీహెచ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కంకరను తయారు చేశారు. ఆర్టిఫీషియల్ అగ్రిగెట్స్‌పేరుతో తయారు చేసిన ఈ కంకర అతి తక్కువ ధరలో రోడ్లకు, రైల్వేల ట్రాక్‌లకు వినియోగించేలా కంకర రూపొందించారు. ప్రస్తుతానికి ఇది పరిశోధన దశలోనే ఉందని, త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు.



మొహర్రం కోసం ముస్లింను
తెచ్చుకున్న గ్రామం

- 60 ఏళ్ల క్రితం ముస్లింను ఆహ్వానించిన గ్రామస్థులు
- రాణాపూర్‌లో ఒక రోజు ఆలస్యంగా..



రాణాపూర్‌లో దూద్‌పీర్‌ను తయారు చేస్తున్న మాసీంసాబ్

నారాయణఖేడ్, జూలై 15 : కులమతాలకు అతీతంగా మొహర్రంను నిర్వహిస్తారు. మొహర్రంలో ఏర్పాటు చేసే పీర్లను తయారు చేయాలంటే ముస్లింలు అవసరం. ఓ గ్రామంలో అసలు ముస్లింలే లేకపోవడంతో దశాబ్దాల క్రితం ఓ కుటుంబాన్ని తీసుకొచ్చారు. ఆ గ్రామమే నారాయణఖేడ్ డివిజన్ పరిధి మనూరు మండలంలోని రాణాపూర్.

గ్రామంలో దాదాపు 250 కుటుంబాలు, 1500 జనాభా ఉండగా వారిలో మరాఠాలు, గౌడ్‌లు, ముదిరాజ్, ఎస్సీ, ఎస్టీలు, పద్మశాలీలు, ఇతర వర్గాల వారు ఉన్నారు. గ్రామం మొత్తంలో ఒక ముస్లిం లేకపోవడంతో పూర్వం మొహర్రంను జరుపుకునే వారు కాదు. తమ గ్రామంలోనూ మొహర్రం నిర్వహించుకోవాలని గ్రామ పెద్దలు దాదాపు 60 సంవత్సరాల క్రితం పుల్‌కూర్తి నుంచి ఒక ముస్లిం కుటుంబాన్ని రాణాపూర్‌కు ఆహ్వానించారు. ఆ కుటుంబ జీవనోపాధి కోసం ఎకరా భూమితో పాటు వసతి కల్పించి, మజీద్‌ను నిర్మింపజేశారు. అప్పటి నుంచి ఆ కుటుంబం వారు తయారు చేసిన దూద్‌పీర్‌తోనే మొహర్రంను నిర్వహిస్తున్నారు. అయితే, ఇక్కడ ఒక రోజు ఆలస్యంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అందరితో పాటే పీర్లను ప్రతిష్ఠించినప్పటికీ చివరి రోజూ కార్యక్రమాన్ని మాత్రం ఒక రోజు ఆలస్యంగా జరుపుతారు. ఆరోజున శ్రమజీవులు పోటాపోటీగా లయబద్ధంగా పాడుతూ మజన ఆడడం విశేషంగా ఆకట్టుకుంటుంది. ముస్లిం కుటుంబానికి చెందిన మాసీంసాబ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పీర్లను తయారు చేసి ప్రతిష్ఠిస్తున్నారు.

అనాదిగా మా కుటుంబీకులే పీర్లను కడతారు

రాణాపూర్‌లో మొహర్రం సందర్భంగా అనాదిగా మా కుటుంబీకులే పీర్లను తయారుచేస్తారు. గ్రామంలో ముస్లిం లేకపోవడంతో మా కుటుంబీకులను ఆహ్వానించి ఆదరించడంతో ఇప్పటివరకు మేమే పీర్లను తయారు చేసి ఉత్సవం జరుపుతున్నాం.

- మాసీంసాబ్

పరిహారం.. పేచీ

- సంగారెడ్డి రీచ్‌కెనాల్‌కు భూములిచ్చేందుకు రైతుల విముఖత
- వదులుకునే ప్రసక్తే లేదని పోరుబాట
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రిలే దీక్షలకు దిగిన వైనం

నర్సాపూర్, జూలై 15: సిద్దిపేట జిల్లా కొండపోచమ్మసాగర్ నుంచి కాలువల ద్వారా సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టును నింపేందుకు తలపెట్టిన రీచ్‌కెనాల్ పనులకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కాలువ మార్గంలో ఉన్న ఆయా గ్రామాల్లోనే చెరువులను సైతం నింపేందుకు ప్రణాళికలు రూపొందించగా భూసేకరణ తలనొప్పిగా మారింది. రూ.కోటి వరకు పలికే భూములను కారుచౌకగా ఇవ్వమంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం విషయంలో పేచీ నెలకొనడంతో రీచ్‌కెనాల్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సంగారెడ్డి కెనాల్ పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రణాళికలు రూపొందించి సర్వే చేశారు. మెదక్ జిల్లాలో రీచ్‌కెనాల్ కోసం మనోరాబాద్, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల పరిధిలో భూమిని సేకరించాల్సి ఉంది. నర్సాపూర్ మండలంలో 491 మంది రైతుల నుంచి 289.04 ఎకరాలు, శివ్వంపేట మండలంలో 836 మంది రైతుల నుంచి 288.17ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి అధికారులు గతంలోనే ఆయా గ్రామాల్లో ఎంత మేర సేకరించాలని గుర్తించారు. ఇటీవల భూసేకరణపై రైతుల అభిప్రాయం తెలుసుకోవడానికి సమావేశాలను నిర్వహించారు. అయితే, భూసేకరణకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎకరా రూ.కోటి వరకు ఉన్న భూములకు రూ.15 లక్షల నామమాత్రపు పరిహారం ఇస్తుండడంతో మండిపడుతున్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడమే కాకుండా ధర్నాలు సైతం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నాలుగు రోజులుగా డివిజన్ కేంద్రమైన నర్సాపూర్‌లో రిలే దీక్షలకు దిగారు. రూ.50 లక్షలపైచిలుకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భూమికి భూమి ఇవ్వాలని అప్పుడు భూసేకరణకు సహకరిస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు భూముల ఇచ్చేందుకు ఒప్పుకునేది లేదంటూ తేల్చిచెబుతున్నారు. నాల్గవ రోజైన సోమవారం చిన్నచింతకుంట రైతులు రిలే దీక్షలో కూర్చున్నారు. ఇప్పటికే రీజినల్ రింగు రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో పలుచోట్ల ట్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం సర్వేకు వస్తున్న అధికారులను అడ్డుకుంటూ తిప్పి పంపుతున్నారు. తాజాగా సంగారెడ్డి కెనాల్ కోసం భూసేకరణ చేపట్టడంత అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది.



నాల్గో రోజు రిలే దీక్షలో కూర్చున్న చిన్నచింతకుంట రైతులు

సేకరించే భూముల వివరాలు

గ్రామం	రైతులు	విస్తీర్ణం(ఎకరాలలో)
నర్సాపూర్ మండలంలో		
పెద్దచింతకుంట	143	63.03
రెడ్డిపల్లి	16	11.32
చిప్పల్‌తుర్తి	56	44.36
చిన్నచింతకుంట	77	48.04
బ్రాహ్మణపల్లి	106	33.04
లింగాపూర్	93	58.04
శివ్వంపేట మండలంలో		
చెన్నాపూర్	137	29.6
పెద్దగొట్టిముక్ల	159	74.29
సికింద్లాపూర్	131	61.01
లింగోజిగూడ	18	4.16
పిల్లుట్ల	221	81.17
చిన్నగొట్టిముక్ల	105	28.39
తిమ్మాపూర్	65	10.9



ఉన్న భూమి ఇస్తే ఎట్లా బతకాలి

మాకు ఉన్న మూడు ఎకరాలను సంగారెడ్డి కెనాల్ కోసం ఇస్తే మా కుటుంబం ఎట్లా బతకాలి. తరతరాలుగా ఈ భూమిని నమ్ముకుని బతుకుతున్నాం. ఎకరా కోటి వరకు పలికే భూమికి రూ.15లక్షలు కూడా రావు. విలువైన భూములు ఇచ్చి మేము రోడ్డు పాలు కావాలా? భూమికి భూమి లేకపోతే.. ఎకరాలకు రూ.50 లక్షలకుపైగా పరిహారం ఇస్తేనే ఒప్పుకుంటాం.

- మహేష్‌గౌడ్, చిన్నచింతకుంట



స్పష్టమైన హామీ ఇవ్వాలి

రైతుల అభిప్రాయాలు తీసుకోవడానికి గ్రామసభలు నిర్వహించకుండా సర్వే చేయడానికి అధికారులు రావడం విడ్డూరంగా ఉంది. పరిహారం విషయం తేలిన తర్వాతే భూసేకరణ చేయాలి. వారికి స్పష్టమైన హామీ ఇవ్వాలి. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

- నాగరాజు, సీపీఎం డివిజన్ కార్యదర్శి

కొత్త స్టోన్ క్రషర్లకు అనుమతులు
ఎలా ఇస్తారు?

ప్రజాభిప్రాయ సేకరణలో ఏర్పాటును వ్యతిరేకించినా వినరా?

మాదారం, రాళ్లకత్వ పరిధిలో కంకర మెషీన్లు, క్వారీలు వద్దని ఆందోళనలు



మండలంలో ఓ స్టోన్ క్రషర్ క్వారీలోని భారీ గుంత

జిన్నారం, జూలై 15: జిన్నారం మండలంలో ఉన్నవి చాలవన్నట్లు కొత్తగా విస్తరిస్తున్న స్టోన్ క్రషర్లు, క్వారీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మాదారం, కాజీపల్లి, రాళ్లకత్వ, సోలక్‌పల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే 13 వరకు స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో కొత్తగా మరో ఆరు క్రషర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతుండగా స్థానికులు ఆందోళన బాట పట్టారు.



సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మాదారం జేఏసీ నాయకులు

పేలుళ్ల శబ్దాలు, దుమ్మూధూళితో ఇక్కట్లు

మండలంలోని కాజీపల్లి, మాదారం, రాళ్లకత్వ పరిధిలో ఉన్న స్టోన్‌క్రషర్లతో స్థానికులకే కాకుండా ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. క్రషర్ల వద్ద బండరాళ్ల కోసం జరిపే పేలుళ్ల శబ్దాలతో వణికిపోతున్నారు. భారీ పేలుళ్లకు సమీప నివాసాలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. అద్దాలు పగలటం, బోరుమోటార్లు భూమిలో కూరుకుపోవటం, బండరాళ్లు పోలాలు, జలాశయాలలో పడటం జరుగుతున్నాయి. వీటికి తోడు కంకర తయారీలో భారీగా వెలువడుతున్న తెల్లటి రాయి దుమ్ము కిలోమీటర్ల మేర వ్యాపిస్తుంది. ఓవైపు పరిశ్రమల కాలుష్యంతో ఇక్కట్లు పడుతున్న వారికి క్రషర్ల వల్ల కష్టాలు తప్పటం లేదు.


ప్రజాభిప్రాయానికి విలువేది?

మాదారంలో స్టోన్‌క్రషర్ల ఏర్పాటును చాలా మంది వ్యతిరేకించినా అక్కడ కొత్తగా నాలుగు, రాళ్లకత్వలో రెండు క్రషర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇక రాళ్లకత్వలో 2022 ఏప్రిల్ 16న అసలు ప్రజాభిప్రాయ సేకరణే వద్దని గ్రామానికి వచ్చిన అధికారులకు స్థానికులు రోడ్డుపైనే అడ్డుకున్నారు. అధికారులు నామమాత్రంగా కార్యక్రమం నిర్వహించగా ప్రస్తుతం క్రషర్ ఏర్పాటుకు అన్నీ సిద్ధం అవుతున్నాయి. గతంలోనే క్రషర్ల ఏర్పాటు వద్దని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, పర్యావరణ వేత్తలు కొత్త స్టోన్ క్రషర్ల ఏర్పాటు వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నా.. ప్రభుత్వం, అధికారులు ఏమీ పట్టనట్లు అనుమతులు ఇవ్వటంతో ప్రజాభిప్రాయాలకు విలువ లేదనే స్పష్టమౌతుంది.

జేఏసీగా ఏర్పడి..

మాదారం పరిధిలో నాలుగు స్టోన్ క్రషర్ క్వారీల ఏర్పాటుకు పనులు చేపట్టారని స్థానికులు ఆందోళన బాట పట్టారు. ఇటీవల గ్రామసభను నిర్వహించి క్రషర్ల ఏర్పాటు, పరిధి విస్తరణ చేయరాదని, కంకర మిషన్ల అనుమతులు రద్దు చేయాలని తీర్మానించారు. అన్నివర్గాలతో కలిసి జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపట్టారు. మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో క్రషర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో ఫిర్యాదు కూడా చేశారు. కాగా ఇటీవల రాళ్లకత్వవాసులు కూడా తహసీల్దార్‌కు క్రషర్ల ఏర్పాటు వద్దని విన్నవించారు. వారూ సమష్టి పోరాటానికి సన్నద్ధం అవుతున్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం



మాదారం పరిధిలో కొత్తగా స్టోన్ క్రషర్ల ఏర్పాటు, క్వారీలకు అనుమతులపై గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న క్రషర్లతోనే స్థానికంగా జీవించలేని పరిస్థితులు ఉన్నాయి. మరికొన్నింటికి అనుమతులు ఇవ్వటం దారుణం. నిబంధనలకు వ్యతిరేకంగా రహదారులు, నీటి వనరులు, జనవాసాలకు సమీపంలో క్రషర్ల ఏర్పాటుపై పోరాటం చేస్తాం.

- విజయ్‌కుమార్‌గౌడ్, జేఏసీ అధ్యక్షుడు



తీర్మానాలను వెల్లడిస్తున్న కౌన్సిల్ సభ్యులు

రూ. 2.95 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

అందోలు-జోగిపేట బల్దియా సమావేశంలో 27పనులకు తీర్మానం

జోగిపేట, జూలై 15: అందోలు - జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సోమవారం సాయంత్రం చైర్మన్ గూడెం మల్లయ్య అధ్యక్షతన జరిగిన బల్దియా సమావేశంలో రూ. 2.95 కోట్ల 14వ, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో ఈ పనులను చేపట్టాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. 27వార్డుల పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, భూగర్భ డ్రైనేజీ తదితర 27 పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వీటితో పాటు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు, వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ తదితర పనులు కూడా చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మేతరి ప్రవీణ్, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు డీ. శంకర్, భాగ్య లక్ష్మి, మాధవి, హరికృష్ణ గౌడ్, పుర్ర ప్రవీణ, భవాని, ధనలక్ష్మి, పట్లోళ్ల రేఖ, నాగరాజు, రంగ సురేష్, దుర్గేష్, చిట్టి బాబు, సురేందర్‌గౌడ్, భారతిగౌడ్, చందర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ లే అవుట్ రద్దు చేసి

రైతులకు భూములు అందజేయాలి



జిన్నారంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, రైతులు, నాయకులు

జిన్నారం, జూలై 15: జిన్నారం సర్వే నెంబర్ 1 అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ లే అవుట్‌ను రద్దు చేయాలని రైతులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌తో కలిసి స్థానిక రైతులు తహసీల్దార్ భిక్షపతికి వినతి పత్రం అందజేశారు. 120 ఎకరాల రైతుల అసైన్డ్ భూముల్లో రెండేళ్ల క్రితం హెచ్ఎండీఏ లే అవుట్ కోసం భూములు సేకరించారని, రైతులకు కేటాయించిన 600గజాల భూమికి పొజిషన్లు నేటికీ చూపలేదని తెలిపారు. భూములు ఇవ్వని రైతుల పొలాల్లో వ్యవసాయ పనులు చేయనివ్వడంలేదన్నారు. ఇదే నెంబరులో టీజీఐఐసీ ద్వారా పరిశ్రమ కోసం కేటాయించిన స్థలాన్ని కూడా రద్దు చేయాలని, పూర్తి భూమిని రైతులు, గ్రామ ప్రయోజనాల కోసం కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ ఎంపీటీసీలు పుట్టి భాస్కర్, లావణ్య నరేష్, నాయకులు నరేందర్, వెంకటేష్, దుర్గయ్య, వెంకటేశంగౌడ్, రమేష్, కోటేశ్‌గౌడ్, రాములు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



మునీశ్వరుడు తపస్సు చేసిన ప్రాంతంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరద పాయసంతో పూజలు

కోహీర్, జూలై 15: మండలంలోని బిలాల్‌పూర్‌లో సోమవారం మునీశ్వరునికి కోహీర్ ప్రాంతానికి చెందిన ప్రజలు వరద పాయసంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండాలని ఏటా ఆషాడమాసంలో బిలాల్‌పూర్‌లోని మునీశ్వరుడు తపస్సు చేసిన ప్రాంతంలో భక్తులు వరద పాయసాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే సోమవారం కోహీర్ గ్రామానికి భక్తులు ఎడ్ల బండ్లపై బాజా భజంత్రీలతో వరద పాయసం తీసుకు వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి వరద పాయసాన్ని సమర్పించారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి

రామాయంపేట/పెద్దశంకరంపేట: పట్టణంలోని పోలీస్ స్టేషన్లో సీఐ వెంకట రాజాగౌడ్ పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొహర్రం సందర్భంగా సోమవారం ముస్లిం పెద్దలతో సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా పీర్ల పండుగ జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా పెద్దశంకరంపేటలోనిపోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ.. పండుగలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో హిందూ, ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

కుంట కట్ట ఆక్రమణపై చర్యలు

తూప్రాన్, జూలై 15: యావాపూర్ శివారులో సూర్యమ్మ (కుమ్మరికుంట) ఆక్రమణపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇరిగేషన్‌శాఖ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ సోమవారం సూర్యమ్మ కుంటను పరిశీలించారు. కుంటకట్టపై వేసిన సిమెంట్ ప్రీబిక్స్ పలకలను తొలగించారు.

రామాయంపేటలో ప్రజావాణికి విశేష స్పందన

రామాయంపేట, జూలై 15: రామాయంపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో 98 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు అర్జీలు సమర్పించుకునేందుకు బారులు తీరారు. ప్రధానంగా డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 51, వ్యవసాయ భూముల సమస్యలపై 10, పట్టణంమీదుగా కొత్త బైపాస్ వద్దంటూ 2, రేషన్ కార్డులు తదితర సమస్యలపై 35 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ రజని తెలిపారు.

● నర్సాపూర్: నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాల్గు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చినవాటిలో నర్సాపూర్ మండలం నుంచి 2, కౌడిపల్లి మండలం నుంచి 2 చొప్పున భూసంబంధిత ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు.

● హవేళిఘణపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి 2 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆబేద్ పాల్గొన్నారు.



రామాయంపేటలో మహిళ నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న తహసీల్దార్ రజని

● చేగుంట: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం అధికారు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చాయని ఎంపీవో హన్మంతరావు తెలిపారు. చేగుంట పట్టణంలో రోడ్లపై “దుకాణాలు, చేపల మార్కెట్‌తో ఇబ్బందులు ఎదురౌతున్నాయని వాటిని తొలగించాలని కోరారు. పట్టణంలోని 8వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ. నర్సింగ్ యాదవ్ ,తదుతరులు పాల్గొన్నారు,

● శివ్వంపేట: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 3 ఫిర్యాదులు రాగా, వాటిలో 2 భూసంబంధిత, ఒకటి రోడ్డు కబ్జాపై వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ షఫీయోద్దీన్ తెలిపారు. మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామం నుంచి గంగయ్యపల్లి మీదుగా చండీకి గ్రామానికి ఉన్న నక్షబాట రోడ్డును మండలంలోని గంగయ్యపల్లిలో కొందరు వ్యక్తులు అక్రమంగా రోడ్డు ధ్వంసం చేసి అక్రమించారని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గంగయ్యపల్లి గ్రామ రైతులు, గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు సాయిలు, సామయ్య, పోచమ్మ, సత్యనారాయణ, గ్రామస్తులు మన్నె శివ,మల్లేశం, సందీప్, కుమార్ ఉన్నారు.



శివ్వంపేటలో రోడ్డు కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న గంగయ్యపల్లి గ్రామస్థులు

కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలిసారి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పుల్‌కల్, జూలై 15: కాంగ్రెస్ అధికారం చేపట్టాక లబ్ధిదారులకు తొలిసారిగా కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. ఏడాది క్రితం కల్యాణలక్ష్మి పథకానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకుని, ఆర్థిక సహాయానికై ఇంతకాలం ఎదురు చూశారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబరు నెలలో నోటిఫికేషన్ జారీ కావడంతో కల్యాణలక్ష్మి పథకానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగడం, కోడ్ అమలులో ఉండటంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పలేదు. ఎట్టకేలకు ఒకేసారి మండలానికి చెందిన 91మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పుల్కల్ తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. మొత్తం 91 మంది లబ్ధిదారులకుగాను రూ.91,10,556 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని



చెక్కును అందజేస్తున్న తహసీల్దార్ కృష్ణ

138 మందికి సీఎం సహాయనిధి ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పంపిణీ చేశారు.

చెక్కులు అందజేయడంలో జాప్యమెందుకు?

జహీరాబాద్, జూలై 15: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడిచినా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తుందని మాజీ ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మెన్ నరోత్తం ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి చెక్కులను అందజేసిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 600 పైచిలుకు మంది లబ్ధిదారులున్నారన్నారు. వెంటనే వారికి చెక్కులను ఇవ్వకపోతే ఆందోళనలను చేస్తామన్నారు.



న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ

సంగారెడ్డి క్రైం, జూలై 15: సంగారెడ్డిలోని న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు జారీ చేసిన హెల్త్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులకు పర్మనెంట్ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. న్యాయవాదుల బీమా ప్రీమియం రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు సూర్‌రెడ్డి, అంబరీష్, అశోక్, అంజనేయులు, నిజాముద్దీన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డికి సన్మానం

సంగారెడ్డి అర్బన్, జూలై 15 : తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీయల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా(టీజీఐఐసీ) బాధ్యతలు స్వీకరించిన తూర్పు నిర్మలాజగ్గారెడ్డిని సోమవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి బూసన్నగారి అశోక్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు అశోక్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట సదాశివపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిశైలేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నిర్మలారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు అశోక్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి

పరిశ్రమ కాలువ పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుమ్మడిదల, జూలై 14 : అసలే గుంతలు రోడ్డుతో అవస్థలు పడుతున్న వాహనదారుల రాకపోకలను అడ్డుకునేవిధంగా ఓ పరిశ్రమ వర్షపునీటిని బయటకు వదులుతూ కాలువను తవ్వారు. రోడ్డుకు అడ్డంగా తవ్విన ఈ కాలువ వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుకు అడ్డంగా పరిశ్రమ కాలువ' అనే శీర్షికతో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో వెంటనే పరిశ్రమ యాజమాన్యం తన సిబ్బందితో అడ్డంగా తవ్విన కాలువను సోమవారం పూడ్చివేశారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఆంధ్రజ్యోతి పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్యను అందించాలి'

పెద్దశంకరంపేట, జూలై 15: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అల్లాదుర్గం సీడీపీవో హేమ భార్గవి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన ప్రాథమిక విద్య శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పూర్వప్రాథమిక విద్యను కూడా అందించాలని సూచించారు.

ఎంపీని సన్మానించిన అంగన్‌వాడీలు



ఖేడ్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నారాయణఖేడ్, జూలై 15: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను సోమవారం నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహం ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లు సన్మానం చేశారు. ఎంపీగా ఎన్నికైన అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఆయనకు సన్మానం చేసి, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీసభ్యులు నగేష్ షెట్కార్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లునాగేశ్వరి,అనురాధ,వీణకుమారి, స్వరూప, వాసంతి, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బడిబాట

నారాయణఖేడ్,జూలై 15:నారాయణఖేడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, పిల్లల భవిష్యత్తుకు పునాది వేయాలంటూ అంగన్‌వాడీ టీచర్లు నినాదాలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు నాగేశ్వరి, అనురాధ, యశోద, స్వరూప, వాసంతి పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాతా మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే శనివారం వరకు కొసాగుతుందని తెలిపారు. మూడు సంవత్సరాల బాలలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైమరి స్కూల్ టీచర్లు రజిత, శ్రీలత, అంగన్‌వాడి టీచర్ శశికళ, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం

చిలప్‌చెడ్, జూలై 14: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి భ్రూణ హత్యలు చేయడం చట్టరీత్యా నేరమని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు నాగమణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారిత సంఘం వారు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు నాగమణి మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలన, ఫోక్సో యాక్ట్ గురించి వివరించారు. అదేవిధంగా సైబర్ క్రైమ్, సఖీ సర్వీస్ సెంటర్ సేవలు తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో ప్రేమలత, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు కవిత, సీసీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పట్టవా?



సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సంగారెడ్డి రూరల్, జూలై 15: అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి వారి సమస్యలు పట్టావా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలపై ఐసీడీఎస్ మంత్రి సీతక్కతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చామన్నారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో 10ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సాయిలు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకులు బాబురావు, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, మంగ, ఏసుమణి, సంగీత, కవిత, రజిత, విజయ, మంగ పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** పెండింగ్‌లో ఉన్న సమస్యలన్ని పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళనలను చేస్తామన్నారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రెగ్యులర్ చేసి, వారికి నష్టం కలిగించే జీవోనెం.10ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలోసీ ఐటీయూ నాయకులు సతీష్, అంగన్‌వాడీ టీచర్లు నాగేశ్వరి, అనురాధ, వీణ, పార్వతి, స్వరూప, మంగళ, శాంతమ్మ, ప్రభావతి, భాగ్యలక్ష్మి, వీరమణి, సుశీల, చంద్రమ్మ, శైలజ, భూదేవి, శ్యామల, సమాధాన, అనిత, తదితరులు ఉన్నారు.

● **నర్సాపూర్:** తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటుకు అంగన్‌వాడీ ఉద్యోగులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు అన్నపూర్ణ, మంజుల, రేణుక, పుష్ప తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● **పలు మండలాల్లో వనమహోత్సవం**

పెద్దశంకరంపేట, జూలై 15: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు.కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎస్ఐ శంకర్, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మాసాయిపేట:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం మండల ప్రత్యేక అధికారి జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటడంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు ధర్మపురి, ఉపాధ్యాయులు రంగారెడ్డి, రాజేశ్వరరావు, ఆర్ఐ ధన్‌సింగ్, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● **శివ్వంపేట:** నర్సరీల నుంచి మొక్కల వేర్లు బలపడ్డ తర్వాతే తీసుకెళ్లి నాటితే మొక్క వంద శాతం బతికే



పెద్దశంకరంపేటలో మొక్క నాటుతున్న ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

అవకాశం ఉంటుందని, నాటిన మొక్కలను జీపీఎస్ శాటిలైట్ కోఆర్డినేట్ ద్వారా రికార్డు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, శివ్వంపేట మండల ప్రత్యేక అధికారి నర్సయ్య తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీవో నాగేశ్వర్‌తో కలిసి మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో తిరుపతి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఉన్నారు

శివపంచాక్షరితో మార్మోగిన బసవ సేవాసదన్



శివపంచాక్షరి యజ్ఞాన్ని నిర్వహిస్తున్న కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య

సదాశివపేట, జూలై 15: పట్టణంలోని చౌకిమఠం, బసవసేవాసదన్‌లో ఈ నెల 13న ప్రారంభమైన శివపంచాక్షరి కోటి జపయజ్ఞం, ఇష్టలింగార్చన మహోత్సవాల్లో భాగంగా సోమవారం 'ఓం నమ:శివాయ' శివపంచాక్షరి మహామంత్రంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. కాశీ పీఠాధిపతి, జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి వేలాది సంఖ్యలో భక్తులు, మహిళలు రుద్ర నమక చమకాలతో ఇష్టలింగార్చన అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర శివాచార్యులు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నాలుగు వేదాలలో ఉన్న మంత్రాలన్నింటిలో శివపంచాక్షరి మంత్రం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

రేగోడు జూలై 15: రేగోడు పెద్దమ్మ దేవి ఆలయం, గంగమ్మ దేవి ఆలయ నిర్మాణానికి సోమవారం రేగోడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యామ్‌రావు కులకర్ణి, డైరెక్టర్ నాగేందర్‌రావులు భూమి పూజ చేశారు. ఈ ఆలయ నిర్మాణాలకు దాదాపు రూ. 20 లక్షల విలువ చేసే 6 గుంటల భూమిని శ్యామ్‌రావు కులకర్ణి, నాగేందర్‌రావులు విరాళంగా అందజేశారు. రేగోడు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడి గంగమ్మ గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, స్థల వితరణ చేసిన దాతలకు శాలువాతో సన్మానం చేశారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకరి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన మధు

హత్నూర, జూలై 15: కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామసమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. సంగారెడ్డి మండలం గౌడిచర్ల గ్రామానికి చెందిన సాద్దుల్‌నగర్ మధు(22) ఆదివారం రాత్రి కారులో గుండ్లమాచూనూర్ నుంచి ఇస్మాయిల్‌ఖాన్‌పేట్‌కు బయలుదేరాడు. గుండ్లమాచునూర్ గ్రామ సమీపంలోకి చేరుకోగానే కారు అదుపు తప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు

ప్రమాదవశాత్తు నీట మునిగి కూలీ మృతి

శివ్వంపేట, జూలై 15: తల్లితో కలిసి ఫామ్ హౌస్‌లోకి దినసరి కూలికి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన దొంతి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన యువకుడు పిట్టల అర్జున్ (23) తల్లి పిట్టల శోభతో కలిసి సోమవారం దొంతి శివారులోని వెంకట్రాంరెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో కూలీపని చేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ఫామ్‌హౌస్‌లో కాలుజారి నీటి సంపులో పడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైపాల్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



రమేష్ మృతదేహం

చిన్నశంకరంపేట, జూలై 15: ఆత్మయత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పసుల రమేష్ (26)పాడి పశువుల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో కొన్నాళ్లుగా మనోవేదనకు గురయ్యాడు ఈ నెల 9వ తేదీన రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి అస్వస్థకు గురయ్యాడు. కుటుంబీకులు హుటా హుటిన హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ భూమిలో దంపతులపై దాడి

తూప్రాన్, జూలై 15: వ్యవసాయ భూమిలో దంపతులు దున్నుతూ సాగు పనులు చేస్తుండగా కొందరు అక్రమంగా ప్రవేశించి వారిపై దాడి చేశారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన చీమలదారి లావణ్య, శ్రీనివాస్‌గౌడ్ దంపతులు తమ భూమిలో ట్రాక్టర్‌తో దున్నిస్తున్నారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన కొంతం రాములు, కొంతం కృష్ణ, మరొకరితో కలిసి అక్కడకు వచ్చి బూతులు తిడుతూ శ్రీనివాస్‌గౌడ్‌పై కర్రతో దాడి చేసినట్లు తెలిపారు. భార్య లావణ్య అడ్డుగా వెళ్లగా ఆమెపై దాడి చేసి గాయపర్చారు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వైన్స్‌లో నగదు, మద్యం చోరీ

నర్సాపూర్, జూలై 15: నర్సాపూర్‌లో ఓ వైన్స్‌లో జరిగిన చోరీలో రూ.54వేల నగదుతో పాటు 13వేల విలువ చేసే మద్యం అపహరణకు గురైంది. నర్సాపూర్-మెదక్ రోడ్డులో ఉన్న సాయివిక్కి వైన్స్ నిర్వాహకులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మద్యం దుకాణానికి తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వైన్స్ వెనుక నుంచి దూరి అందులో ఉన్న రూ.54వేల నగదుతో పాటు రూ.13వేల విలువగల మద్యాన్ని అపహరించినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

తూప్రాన్‌లో యువకుడి అదృశ్యం



నర్సింహులు

తూప్రాన్, జూలై 15: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకోగా సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన ఉడుత నర్సింహులు(33) కూలీ పనులు చేస్తు జీవిస్తున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం బట్టలు ఐరన్ చేయించుకోడానికి వెళ్తున్నట్లు భార్య కల్పనకు చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొల్లపల్లి గ్రామంలో మరో యువకుడు..

చేగుంట జూలై 15: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. చేగుంట ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం గొల్లపల్లి గ్రామనికి చెందిన కర్రె రాజేందర్ (23) శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గోవాకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి రాజమణి కుమారుడికి ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తుందని తెలిపారు. బంధువుల వద్ద. వెతికినా ఆచూకీ దొరకలేదు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇన్‌స్పైర్‌కు అత్యధిక నామినేషన్లు రావాలి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూలై 15: ఇన్‌స్పైర్‌కు అత్యధిక నామినేషన్లు రావాలని ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని డీఈవో వెంకటేశ్వర్లు కోరారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఇన్‌స్పైర్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అదే విధంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం)కి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించగా, సెప్టెంబరు 15వ తేదీ వరకు 6 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకొని కార్యక్రమంలో పాల్గొనాలని డీఈవో కోరారు. అంతకుముందు జన్యా ఫౌండేషన్, గ్లాండ్ ఫోసస్ ఫౌండేషన్ సహకారంతో 40 పాఠశాలల్లో జన్యా ల్యాబ్ ఇన్ ఎ బాక్స్(జెఎల్‌బీబీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, జీహెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

● **జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య**

శివ్వంపేట, జూలై 15: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శివ్వంపేట మండల ప్రత్యేక అధికారి నర్సయ్య తెలిపారు. సోమవారం శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చునని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్రామాల్లో పీర్ల ఊరేగింపు



శివ్వంపేటలో పీర్ల ఊరేగింపు

శివ్వంపేట, జూలై 15: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం సందర్భంగా సోమవారం 7వ రోజు మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శివ్వంపేటతో పాటు మండలంలోని గూడూర్, నవాబ్ పేట్, చిన్నగొట్టిముక్ల, గోమారం, దొంతి, మగ్దుంపూర్ తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు కుడుకలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం 10వ రోజు పీర్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేయడంతో పీర్ల పండుగ ముగుస్తుందన్నారు.

'రుణాల రికవరీపై దృష్టి సారించాలి'

నారాయణఖేడ్, జూలై 15: రుణాల రికవరీపై దృష్టి సారించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీజీఎం జి.శ్రీనివాస్, ఏజీఎం నారాయణరెడ్డిలు సూచించారు. సోమవారం నారాయణఖేడ్‌ప్రాథమిక సహకార సంఘాన్ని తనిఖీ చేయడానికి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీని చేయనుండడంతో ఇందుకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నామన్నారు. బ్యాంకుల ద్వారా ఇతర రుణాలు పొందినవారు రుణమాఫీ కటాఫ్ తేదీ 2023 డిసెంబరు 9 తర్వాత పంట రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించాలని, పంట రుణాలు పొందినవారు రెన్యువల్ చేసుకోవాలని వారు సూచించారు.